క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి యువత కృషి



పెద్దిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు చెబుతున్న హేమంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. పార్టీ యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన హేమంత్ రెడ్డి తిరుపతిలో పెద్దిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు పెద్దిరెడ్డి పైవిధంగా మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు జ్ఞానేంద్రరెడ్డి, జంపాల రాజేష్, లోక, శరత్ రెడ్డి, దిలీప్ కుమార్, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన సతీష్

చంద్రగిరి: రోడ్డు దాటుతున్న క్రమంలో కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు తీవ్ర గాయాలై మరణించాడు ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి కోట సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. చంద్రగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన సతీష్(29) జేసీబీ ఆపరేటర్. మంగళవారం వ్యక్తిగత పనులపై ఇందిరమ్మ కాలనీ నుంచి చంద్రగిరి వస్తున్నాడు. ఈ క్రమంలో భారత్ పెట్రోల్ బంకులో డీజిల్ కొట్టించుకుని బయటకు వస్తున్న కారును సతీష్ తన బైక్‌తో ఢీకొన్నాడు. ఆపై కల్వర్టుపై పడడంతో కాలు విరగడంతో పాటు ఛాతీపై బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న 108 వాహనంలో చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలను నిర్వహించిన అధికారులు, పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పరిస్థితి విషమించి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సీమ పందుల పెంపకంపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: సీమపందుల పెంపకంలో ఔత్సాహికులు, రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ అన్నారు. సీమ పందుల పెంపకంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం వర్సిటీలోని నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో మొదలైంది. వీసీ ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో మెలకువలు గ్రహించి తక్కువ ఖర్చుతో దాణా తయారీ, యాజమాన్య పద్ధతులను పాటించడం ప్రధానమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మం, విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి, కో–ఆర్డినేటర్ డాక్టర్ కే.సుజాత, డాక్టర్ గంగరాజు, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, వివిధ ప్రాంతాల రైతులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

సాంబశివమూర్తికి పురస్కారం



మహామహోపాధ్యాయ పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ సాంబశివమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేస్తున్న డాక్టర్ సాంబశివమూర్తికి మహామహోపాధ్యాయ పురస్కారం వరించింది. గతనెల 27న అలహాబాద్‌లో ప్రయాగరాజ్ హిందీ సాహిత్య సమ్మేళనం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ సుధీర్ నారాయణన్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. సంస్కృత భాషా సాహిత్య ప్రచారం కోసం సుమారు 40 ఏళ్లపాటు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్, అధ్యాపకులు, ఉద్యోగులు ఆయనను అభినందించారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- వెన్నుపోటు రాజకీయ పాలనతో ప్రజలను వంచనతో దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ ఉదయం 9 గంటలకు సత్యనారాయణపురం నుంచి తిరుమల బైపాస్ రోడ్డు వరకు వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు నిరసన ర్యాలీ.
- శ్రీగోవిందరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సింహ వాహనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ముత్యపు పందిరి వాహన సేవ.
- యోగాంధ్ర–2025 ప్రచారంలో భాగంగా ఉదయం 6.45 గంటలకు చంద్రగిరి కోట ఆవరణలో యోగా కార్యక్రమాలు.

నమ్మించి..వంచించి.. వెన్నుపోటు!

అధికారంలోకి రావడమే పరమావధిగా అడ్డగోలుగా హామీలు ఇవ్వడం, ఆపై ప్రజలను వంచించడంలో చంద్రబాబునాయుడిని మించిన వారు దేశంలోనే ఉండరని రాజకీయ పండితులు మాట. చంద్రబాబు గద్దెనెక్కిన ప్రతిసారీ ప్రజలకు ఇది అనుభవపూర్వకమే! ఈ పర్యాయం 'సూపర్‌సిక్స్'తోపాటు బాబు 'ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరిట 143 హామీలను గుప్పించిన కూటమి ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కుచ్చుటోపీ పెట్టింది. ''ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయమేస్తోంది.. సూపర్‌సిక్స్‌ను అమలు చేయడం కష్టమేనంటూ'' సీఎం చంద్రబాబు అసెంబ్లీలో నాలుక మడత తిప్పడంతో ప్రజలు అవాక్కయ్యారు. బాబు హామీలతో తమ చెవుల్లో పూలు పెట్టారని జనం శాపనార్థాలు పెట్టని రోజంటూ లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలలో 98శాతం నెరవేరిస్తే, కూటమి కేవలం పింఛన్ల హామీ మాత్రమే నెరవేర్చి, దగా చేసిందని దుమ్మెత్తి పోస్తున్నారు.

- సూపర్‌సిక్స్ ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- ఏడాది గడుస్తున్నా నెరవేర్చని హామీలు
- ఆర్థిక స్థితి బాగోలేదంటూ కాలయాపన చేస్తున్న సీఎం
- కూటమి ఏడాది పాలనపై మండిపడుతున్న ప్రజానీకం



తిరుపతి సిటీ: సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరుపతి, చంద్రగిరి నియోకవర్గాలలో జనసేన నేత పవన్ కళ్యాణ్‌తో కలసి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో పాటు 50ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికీ పింఛన్ ఇస్తామని అట్టహాసంగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తిరుపతిలోనే సుమారు 3వేల పింఛన్లు తొలగించారు. దీపం పథకం అంటూ హంగామా చేసిన కూటమి సర్కార్ తిరుపతి, చంద్రగిరి నియోకవర్గాలలో కేవలం 45శాతం మందికి కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. మళ్లీ దీనికి బోలెడు షరతులు విధించారు. అలాగే తిరుపతి నియోజకవర్గంలో సుమారు 1.89 లక్షల మంది లబ్ధిదారులకు తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పి ప్రస్తుతం ఆ ఊసే ఎత్తలేదు. అలాగే చంద్రగిరి నియోకవర్గంలో ఏడాదికి పలు పథకాలకు అర్హులైన 2.17లక్షమంది మహిళలు, వృద్ధులు, విద్యార్థులు కూటమి సర్కార్ హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకోసం ఎదురు చూస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. తిరుపతి రూరల్, చంద్రగిరి ప్రాంతాలలో సుమారు 89వేల మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం కోసం వేచి చూస్తున్నారు. కానీ అమలు చేయలేమనే సంకేతాలు సీఎం చంద్రబాబు ఇచ్చారని ప్రజలు మండిపడుతున్నారు.

జగనన్న పాలనలో ఇళ్లు నిర్మించుకున్నాం..



గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో జగనన్న పాలనలో సొంతింటి కల నెరవేరింది. రామిరెడ్డిగారిఇండ్లు సమీపంలో జగనన్న కాలనీలో ఉచితంగా స్థలాన్ని కేటాయించి, ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థికంగా నిధులను సమకూర్చారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాను. ప్రస్తుతం అదే ఇంటిలో నివసిస్తున్నాను.
– ఎం.నిర్మల, రామిరెడ్డిగారిఇండ్లు, పాకాల మండలం

ప్రజల పరిస్థితి దారుణంగా ఉంది



కూటమి సర్కార్ గత ఏడాదిగా ప్రజలకు చేసింది శూన్యం. కక్ష సాధింపులు, దాడులు, ఇసుక దందాలు తప్ప అభివృద్ధి మాటే లేదు. పేదల సంక్షేమం పూర్తిగా స్తంభించిపోయింది. పథకాలు అమలు కాకపోవడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదల చేతిలో చిల్లిగవ్వలేదు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి.
–ప్రకాష్, చిరు వ్యాపారి, తిరుపతి రూరల్

దారుణమైన పాలన



అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పేరుతో సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తామన్న చంద్రబాబు ఏడాదిగా ఆ ప్రస్తావన ఎత్తడం లేదు. కనీసం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందాల్సిన సంక్షేమాన్ని అడ్డుకున్నారు. డబ్బులు లేవనే సాకుతో మహిళలకు తల్లికి వందనం, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధికి మంగళం పాడేశారు. దారుణమైన పాలన సాగుతోంది.
– రుక్మిణమ్మ, గృహిణి, తిరుపతి

నిరుద్యోగుల మాటే ఎత్తడం లేదు



ఏడాదికి నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ప్రకటించారు. ఏడాదిగా కనీసం ఒక్కరికి కూడా ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. రాష్ట్ర చరిత్రలో ఏడాది పాటు ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వదలని పరిస్థితి ఇదో రికార్డుగా చెప్పుకోవచ్చు. నిరుద్యోగ భృతి అతీగతీ లేదు.ఏడాది పాటు బెదిరింపులు, కేసులు, ప్రశ్నించిన వారిపై తిరగడటం తప్ప ప్రజలకు మేలు చేసింది లేదు.
– నారాయణ రెడ్డి, ప్రైవేటు సంస్థ ఉద్యోగి, తిరుపతి

సెటిల్‌మెంట్ గణపతీ.. నీ ఆక్రమిత భూముల చిట్టా ఇదిగో!

- ఆ భూములను ఇప్పుడు ఏం చేద్దాం.. వెనక్కి ఇచ్చేద్దామా?
- ఎవ్వరైనా భూమి చూడకుండానే అగ్రిమెంట్ రాసుకుంటారా?
- వృద్ధుడికి సాయం చేయాలంటే ఉచితంగా చేయవచ్చు కదా?
- గణపతి చేసిన అక్రమాలను బయటపెట్టిన వైఎస్ఆర్ సీపీ నేతలు



గణపతి అవినీతి, అక్రమాలను వివరిస్తున్న వైఎస్ఆర్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: 'సెటిల్ మెంట్ గణపతీ.. నీ ఆక్రమిత భూముల చిట్టా ఇదిగో.. ఆ భూములను ఇప్పుడు ఏం చేద్దాం.. వెనక్కి ఇచ్చేద్దామా చెప్పు.. ఎవరైనా స్థలమే చూడకుండా అగ్రిమెంట్ రాసుకుంటారా.. అది కూడా మఠం భూమికి, నువ్వు చెప్పినట్టు 80 సంవత్సరాల పెద్దాయనకు సాయం చేయాలని అనిపిస్తే ఉచితంగా చేయొచ్చు కదా.. అతని నుంచి 50 శాతం వాటా కావాలని ఒప్పందల పత్రం రాసుకుంటారా? అదే కాదు మీరు చేసిన భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లు, అవినీతికి సంబంధించిన పూర్తి వివరాలిస్తున్నాం, వాటన్నింటినీ కూడా ప్రెస్‌మీట్ పెట్టి వెనక్కు ఇచ్చేస్తున్నా అని చెప్పగలరా.. గణపతీ' అంటూ వైఎస్ఆర్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిన్నియాదవ్, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, చంద్రగిరి నియోజకవర్గం బీసీసెల్ అధ్యక్షుడు చెంచు మోహన్ యాదవ్‌లు అక్రమాల చిట్టాను మంగళవారం మీడియాకు వివరించారు. వారిచ్చిన వివరాలిలా ఉన్నాయి.

- పద్మావతిపురంలోని ఏకలవ్య నగర్‌లో 1990లో రిటైర్డ్ డీఎస్పీ రాజయ్య 3 ఎకరాలు లేఅవుట్ వేస్తే, అందులోని 60 అడుగుల రోడ్డును 30 అడుగులకు కుదించి మిగతా 30 అడుగుల రోడ్డును, అందులోని పార్కు స్థలాన్ని అమ్మేశారు. ఆ లేఅవుట్ వేసిన 30 ఏళ్ల తర్వాత దానిపై ఒక దొంగ డాక్యుమెంట్ సృష్టించి, అక్కడ ప్లాట్లు కొన్న వారందరినీ బెదిరించి, ఒక అంకణానికి రూ.10 వేలు చొప్పున అక్రమంగా వసూలు చేశారు. ఆ విషయంలోనే గణపతిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేశారు.
- మాజీ మంత్రి గల్లా అరుణకుమారి పద్మావతిపురంలో దోబీ ఘాట్‌కు రజకుల కోసం 50 సెంట్లు భూమి కేటాయిస్తే, దానికి అదనంగా మరో 50 సెంట్లు ఆక్రమించడం, పద్మావతిపురం చెరువు కట్టను ఆక్రమించి 10 రూములు కట్టి ఒక్కొక్క రూముకు ఏడు లక్షల చొప్పున అమ్మేశారు.
- శిల్పారామం ఎదురుగా ఉన్న ఎరుకుల బాటలో 300 అంకణాలను పవన్‌ను ముందు పెట్టి ఆక్రమించి అమ్మేశారు. అలాగే పీఎస్–4 హోటల్ వెనుక ఒక టీచరుకు చెందిన 400 అంకణాల స్థలాన్ని ఆక్రమించి రిలయన్స్ గ్యాస్‌కు లీజుకు ఇచ్చారు. టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బంధువులైన ఒక మహిళ పేరుతో మార్కెట్ యార్డుకు ఆనుకొని ఉత్తరంగా ఉన్న ఈనాం భూమిని ఆక్రమించి ఎలైట్ పార్క్ లాడ్జ్ కట్టించారు.
- తిరుపతి రైతు బజార్‌కు ఆనుకుని 100 అంకణాల కాలువను ఆక్రమించారు. తబున్ హోటల్ దగ్గర ఫ్లై ఓవర్ సమీపంలోని గోశాల వద్ద కల్లం పోరంబోకు భూమిని ఆక్రమించారు. శిల్పారామంలో ఒరిజినల్ లీజు దారుడిని భయపెట్టి నెలకు 1.50 లక్షల చొప్పున బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారు.
- తిరుచానూరు లెక్క దాఖలాలో స్వర్ణముఖి నది వద్ద ఎస్ఎల్‌వీ డ్రైవింగ్ స్కూల్ యజమాని కృష్ణమూర్తి, చిన్న పాపమ్మలకు చెందిన పట్టా భూమి, వారి ఆధీనంలోని ప్రభుత్వ భూమి 9 ఎకరాల భూ వివాదంలో సెటిల్‌మెంట్ చేసి భారీగా దోచేశారు.
- మార్కెట్ యార్డ్ చెక్‌పోస్టుల నుంచి కలెక్షన్ ఏజెంట్ సందీప్ ద్వారా ప్రతినెలా మామూళ్లు వసూలు చేయడం, రైతులు, గోడౌన్ యజమానుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు.
- గణపతితోపాటు టీడీపీ నేత రాజేంద్రకు చెందిన వైన్‌షాపులో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం అమ్మడం, ఆ వైన్‌షాప్ పర్మిట్ రూమ్ (బార్) నడుపుతూ అక్కడ నుంచే బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు.
- ఫెయిర్ అండ్ ఫియెస్ట్ హోటల్ పక్కన 600 అంకణాల స్థలానికి యజమాని ఒకరైతే, మరొకరిని ఆ స్థలంలోకి దింపి కాంపౌండ్ వాల్ కట్టించి, ఆక్రమిత స్థలానికి విద్యుత్ మీటరు ఇప్పించి వారి నుంచి భారీగా కమీషన్ తీసుకున్నారన్నారు. ఈ సమావేశంలో తిరుపతి రూరల్ ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు మునీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



గాంధీపురంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

తిరుపతి రూరల్: మండలంలోని గాంధీపురం, హరిపురం కాలనీల్లో గంగమ్మ జాతర్లకు వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. మంగళవారం రాత్రి ఆయా గ్రామాలకు చేరుకుని నడివీధి గంగమ్మలకు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. తుమ్మలగుంట పంచాయతీ చెంచులక్ష్మి కాలనీకి చెందిన జడ్పీటీసీ రత్నమ్మ నేతృత్వంలో నిర్వహిస్తున్న జాతరకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, గాంధీపురం సర్పంచ్ మన్నూరు లక్ష్మీశివ, గురవారెడ్డి, ఎంపీటీసీ జయకర్ తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై గోవిందుడు



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు మంగళవారం రాత్రి స్వామి వారు హంసవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భజన బృందాల కోలాటాలు, దేవతామూర్తుల వేషధారణలో కళాకారుల ప్రదర్శనల నడుమ వేడుకగా వాహనసేవ సాగింది. తొలుత ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పంచామృతం, చందనం, పలు రకాల పండ్లరసాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకించారు. సాయంత్రం ఉయ్యాలసేవ, అంతకుముందు చిన్నశేషవాహన సేవ వైభవంగా నిర్వహించారు. నాలుగుమాడ వీధుల్లో స్వామివారికి భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, డెప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ కె.మునికృష్ణారెడ్డి, ఏవీఎస్ఓ మోహన్‌రెడ్డి, పలువురు అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దర్శనం

–భక్తిశ్రద్ధలతో మరుపొంగళ్లు



వివిధ ఫలాల అలంకరణలో దర్శనమిస్తున్న తాతయ్యగుంట గంగమ్మ



వివిధ వేషధారణలలో గంగమ్మ మొక్కులు తీర్చుకున్న రంగస్థలి కళాకారులు

తిరుపతి కల్చరల్: చల్లంగా చూడు గంగమ్మ తల్లీ– అంటూ భక్తజనం మంగళవారం ప్రత్యేక అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్ల మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మూడవ మంగళవారం కావడం.. పొంగళ్ల సమర్పణకు వచ్చిన భక్తులతో వేకువజాము నుంచే సందడి మొదలైంది. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. తొలుత ఉదయం అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం అనంతరం వివిధ రకాల పండ్లతో సర్వాంగసుందరంగా అలంకరించి దర్శనానికి అనుమతించారు. వయోభేదం లేకుండా వివిధ వేషాలు ధరించి రంగస్థలి కళాకారులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించారు. మరి కొందరు భక్తులు వేయికళ్ల దుత్తలతో ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి,కార్యదర్శి కేఎన్.రాజా,సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మకు వెండి తొడుగు సమర్పణ

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని బలిపీఠం వద్దనున్న అమ్మవారి పాదాలకు సుమారు రూ. 6.50 లక్షల విలువ చేసే వెండి తొడుగును అప్పిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, పద్మావతి దంపతులు మంగళవారం సమర్పించారు. ఆలయ ఈఓ ఏ.జయకుమార్ చేతుల మీదుగా అమ్మవారి పాదాలకు అలంకరించారు. మునిశేఖర్‌రెడ్డి దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.





తల మీద పొంగళ్ల గంపలు, దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



శ్మశానంలో బిర్యానీ..!

- శ్మశాన స్థలం ఆక్రమించి టేబుల్స్ ఏర్పాటు
- పట్టించుకోని కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు



శ్మశాన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేసిన గోస్ట్ బిర్యానీ హోటల్ నిర్వాహకులు

తిరుపతి మంగళం : బిర్యానీ అంటే తినని మాంసాహార ప్రియులంటూ ఉండరు. అయితే ఎంత రుచి ఉన్నా శ్మశానంలో కూర్చుని మాత్రం బిర్యానీ తినాలని ఎవ్వరూ కోరుకోరు కదా! అయితే తిరుపతిలో కొందరు తెల్లవారు జామున 4 నుంచే 'గోస్ట్ బిర్యానీ' పేరు శ్మశాన స్థలంలో విక్రయిస్తుండటం కంపరం పుట్టిస్తోంది. ఇక, తాము ఎక్కడ తింటున్నామో కూడా పట్టించుకోకుండా మాంసా ప్రియులు ఉండటం గమనార్హం. ఇది ఎక్కడో కాదు; సాక్షాత్తు తిరుపతి మారుతీనగర్‌లోని డంపింగ్‌యార్డ్ వద్ద ఉన్న శ్మశాన స్థలంలో ఈ వ్యవహారం బాహాటంగానే సాగుతున్నా మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

శ్మశాన స్థలంలో అక్రమ నిర్మాణాలు

మారుతీనగర్‌లో డంపింగ్‌యార్డ్ వద్ద ఉన్న శ్మశాన స్థలంలో గోస్ట్ బిర్యానీ హోటల్ నిర్వాహకులు అక్రమ నిర్మాణాలు చేశారు. వినియోగదారుల కోసం శ్మశానంలో స్థలంలో టేబుళ్ల తరహాలో తరహాల్లో నిర్మించి, ఎంచక్కా వ్యాపారం చేస్తున్నారు. అధికారులు దీనిపై ఎప్పుడు దృష్టి సారిస్తారో మరి!

స్టాక్ పాయింట్ పరిశీలన

ఏర్పేడు: మండలంలోని సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర మండల స్టాక్ పాయింట్ అయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి ఏ. దయాకర్ వారికి మండలానికి వచ్చిన సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర కిట్ల వివరాలు తెలిపారు.

గంగమ్మ జాతర



తిరుపతి గాంధీ రోడ్: పద్మావతి పురంలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అంబలి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటును పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ, పొంగలి పెడుతున్న భక్తులు

విద్యాసంస్థల దోపిడీని అరికట్టండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి అర్బన్: విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేతలు అక్బర్, భగత్ రవి మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈవో కేవీఎస్ కుమార్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు రెట్టింపు ఫీజులతోపాటు పుస్తకాల విషయంలోను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీనిమూలాన పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, వీటిపై దృష్టి సారించి కట్టడి చేయాలని కోరారు.